

ఎండిన నదిలో.. పచ్చని పంటలు



నీరు తగ్గడంతో పాయలా మారిన కృష్ణానది

- కృష్ణానదిలో నీరు తగ్గాక సాగు చేస్తున్న రైతులు
- భూములు తేమగా ఉండటంతో అధిక దిగుబడులు
- నీటి తడులు అవసరం లేకుండానే సాగు



జటప్రోల్ శివారులో సాగు చేసిన పుచ్చకాయ తోట



పెంట్లవెల్లి మండలం వెంకల్ దగ్గర కృష్ణానదిలో ఏపుగా పెరిగిన జొన్న

పెంట్లవెల్లి, జనవరి24: నీరు లేక ఎండిన కృష్ణానదిలో రైతులు సిరుల పంటలు పండిస్తున్నారు. అధిక దిగుబడులు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కృష్ణానదిలో నీటి ముంపునకు గురైన నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్, వెంకల్, మాధవస్వామినగర్ గ్రామాల్లోని 1,500 ఎకరాల్లో నదిలో నీరు లేనప్పుడు రైతులు వివిధ రకాల పంటలు వేస్తున్నారు. ఏటా జూన్, జూలై నెలల్లో కృష్ణానది నిండుగా పారుతుంది. నదిలో నీరు తగ్గాక పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడం, నది నుంచి ఇటు తెలంగాణ.. అటు ఆంధ్రప్రదేశ్ నీటిని తరలించడంతో అక్టోబరు, నవంబరు నుంచే నదిలో నీరు తగ్గడం మొదలైంది. నీరు తగ్గడంతో నదిలో తేలిన పొలాలను రైతులు సాగు చేశారు. గతంలో ఉన్న భూముల హద్దులను సరి చేసుకుని, మరికొందరు కౌలుకు తీసుకుని పంటలు వేశారు. ఈ ఏడాది అక్టోబరు, నవంబరులో వేరుశనగ, పొద్దుతిరుగుడు, మినుములు, నువ్వులు, మొక్కజొన్న, శనగ వంటి వివిధ రకాల పంటలతో పాటు పుచ్చకాయ తోట పెట్టారు. భూములు దాదాపు ఆరు నెలల పాటు నీటిలో మునిగి ఉండడం వల్ల సారవంతంగా మారి, అధిక దిగుబడులు పొందుతున్నారు. పంటల్లో ఎలాంటి కలుపు మొక్కలు రావని రైతులు చెబుతున్నారు. అదేవిధంగా ఎలాంటి రసాయన ఎరువులు కూడా వేయబోమని అంటున్నారు. మంచాలకట్ట, జటప్రోల్, మాధవస్వామినగర్ గ్రామాలల్లో బంకమట్టి, నల్లరేగడి భూములు ఉండటంతో భూమిలో ఉండే తేమకే పంటలు పండుతాయి. వెంకల్, మల్లేశ్వరం గ్రామాల్లోని రైతులు మాత్రం నదిలోనే బోర్లు, పైపుల ద్వారా నది నీటిని పారబెట్టి పంటలు పండిస్తున్నారు. ఈ సంవత్సరం కృష్ణా నది పూర్తి స్థాయిలో నిండలేదు. దాంతో తొందరగా ఎండింది. ఈ నేపథ్యంలో ఏ పంటలైనా సాగు చేయొచ్చన్న ఉద్దేశంతో భూముల కౌలు ధర కూడా అధికంగా పలికింది. ఎకరం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ధర పలికింది.



మంచాలకట్టలో కోతకు వచ్చిన శగన పంట



కట్టలు కట్టిన నువ్వుల చేను



మల్లేశ్వరంలో సాగు చేస్తున్న నువ్వుల పంట



కళాశాల వివరాలు తెలుసుకుంటున్న జేఎన్‌టీయూ బృందం

కోస్గికి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల మంజూరు

- పరిశీలించిన జేఎన్‌టీయూ ప్రొఫెసర్ల బృందం
- రాష్ట్రంలోనే మొట్టమొదటి గవర్నమెంట్ కాలేజీ
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభించనున్నట్లు వెల్లడి

కోస్గి రూరల్ జనవరి 24: నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దాంతో రాష్ట్ర ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్లు బుధవారం కళాశాలను పరిశీలించారు. జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు చంద్రమోహన్, ఉజ్వలరేఖ(కంప్యూటర్ సైన్స్), రజిని(ఈసీఈ హెడ్‌డిపార్ట్‌మెంట్) బృందం తనిఖీ చేసింది. కళాశాలలోని వసతులు, తరగతి గదులు, పరికరాలు, కంప్యూటర్ల గురించి ప్రిన్సిపాల్ పరమేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంజనీరింగ్ విభాగంలో అడ్మిషన్లు తీసుకుంటామన్నారు. అందుకు అనుగుణంగా వసతులను పరిశీలిస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, విజయ్‌కుమార్, అన్న కిష్టప్ప, నాగులపల్లి నరేందర్ పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

- నవాబ్‌పేట మండలం మల్లారెడ్డి పల్లిలో ఘటన

నవాబ్‌పేట, జనవరి 24: మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. ఇన్‌చార్జి ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారెడ్డిపల్లికి చెందిన కొత్త పద్మమ్మ(60) ఈ నెల ఏడున ఉదయం పది గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లింది. కొడుకు శ్రీనివాసులు బంధువుల ఇళ్ల వద్ద వెతికినా కనిపించ లేదు. దాంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ తెలిపారు.

'పది' ఫలితాల్లో

ఉత్తీర్ణత శాతం పెరగాలి

- కలెక్టర్ శ్రీహర్ష - గణిత శాస్త్రం ఉపాధ్యాయులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట, జనవరి 24: ఈ ఏడాది జరిగే పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు ఉత్తీర్ణత శాతం పెరగాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆదర్శ కళాశాలలో గణిత శాస్త్రం ఉపాధ్యాయులతో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. పది ఫలితాలు గత ఏడాది కంటే మెరుగు పడాలని, కారణాలు చెప్పకుండా పనితీరు మార్చుకోవాలని సూచించారు. ప్రణాళికతో చేసిన బోధనను మిగిలిన 40 రోజుల పాటు రివిజన్ చేయించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, గత ఏడాది వచ్చిన ఫలితాలపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇంకా 40 రోజుల సమయముందని అంతలోపు పాఠ్యాంశాలలో వెనుకబడిన విద్యార్థులు పాస్ అయ్యే స్థాయికి తేవాలని ఆదేశించారు. గణితంలో చురుకుగా ఉన్న విద్యార్థులు మిగతా సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధిస్తారన్నారు. గణిత శాస్త్రం బోధన ప్రణాళికను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీఈవో అబ్దుల్ ఘని, జీసీడీవో పద్మ నళిని, డీఈవో కార్యాలయ సిబ్బంది విద్యాసాగర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాను తప్పులు లేకుండా సిద్ధం చేయాలి

తుది ఓటరు జాబితా కోసం మార్పులు, చేర్పులు సరి చేసి తప్పులు లేకుండా సిద్ధం చేయాలని కలెక్టర్ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కోయిల్‌కొండ, నారాయణపేట, దామరగిద్ద తహసీల్దార్లు, సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఇప్పటి దాకా పోలింగ్ కేంద్రాల వారిగా మార్పులు, చేర్పులు ఎన్ని జరిగాయనే అంశంపై ఆరా తీశారు. మిస్ మ్యాచింగ్‌ను సరి చేశారా లేదా మరోసారి పరిశీలించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీవో రాంచందర్, తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తుల్జాభవానీ సంబురం



సంప్రదాయ దుస్తుల్లో గిరిజనులు

వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం దొంతికుంట తండాలో గిరిజనులు తుల్జా భవానీ పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. రెండేళ్లకోసారి జరిగే ఈ వేడుక కోసం గిరిజనులు ఇంటి దేవతను ఇళ్లలో ప్రతిష్ఠించుకుంటారు. సంప్రదాయ దుస్తులు ధరించి, ఆమెను కొలుస్తారు. పండుగ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో గ్రాఫర్, వనపర్తి



ఓ ఇంటి వద్ద ప్రతిష్ఠించిన తుల్జాభవానీ అమ్మవారు



సామూహిక పూజల్లో పాల్గొన్న గిరిజనులు



వంట చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్న మహిళలు



వంటలు చేస్తున్న గిరిజన మహిళ



బియ్యం చెరుగుతున్న యువతి

కాలకేయుడిని చంపినోడే బాహుబలి

- పాలమూరులో రాక్షసపాలన ముగిసింది
- సీడబ్ల్యూసీ ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీచంద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి


మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 24: 'పాలమూరులో రాక్షస పాలన ముగిసింది. ప్రజా పాలన మొదలైంది. ప్రజలంతా ప్రశాంతంగా ఉన్నారు. కాలకేయుడిని చంపినోడే బాహుబలి'అని సీడబ్ల్యూసీ ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జేజేఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత వహించారు. వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్లుగా పాలమూరు ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారని, వ్యాపారం చేసుకుందామన్నా భయపడేవారన్నారని చెప్పారు. గత పాలనలో భూకబ్జలతో పాటు బెదిరింపులకు పాల్పడేవారన్నారు. ఇప్పుడు అవన్నీ పోయి, ప్రజలు ప్రశాంతంగా జీవనం గడుపుతున్నారన్నారు. మహబూబ్‌నగర్‌లో త్వరలోనే రూ.15 కోట్లతో క్రికెట్ మైదానం ఏర్పాటుకు బీసీసీఐతో మాట్లాడినట్లు తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గంలో రూ.1,000 కోట్లతో పార్లేజీ బిస్కెట్ కంపెనీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పని అయిపోయిందని, పాలమూరులో అరాచక శక్తుల ఆటలు సాగవన్నారు. ఇక్కడ బీఆర్‌ఎస్ మూలాలు లేకుండా చేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కేసీఆర్, కేటీఆర్, మాజీ మంత్రులు తట్టాబుట్ట సర్దుకొని దిక్కులేని చోటకు వెళ్లడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్‌ను ఓడించామని, బీజేపీని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలోని బీఆర్‌ఎస్ నాయకులు తనకు నిత్యం ఫోన్ చేసి, కాంగ్రెస్‌లో చేరతామని అడుగుతున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వంశీచంద్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. పార్టీ గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. పార్లమెంట్ స్థానాన్ని గెలిపించి, సీఎంకు కానుకగా ఇద్దమని మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే భూ భకాసురుల భరతం పడామన్నారు. ఇతర పార్టీల నాయకులను తమ పార్టీలోకి తీసుకోమన్నారు. సమావేశంలో ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





నేడు సూగూరు కోదండరామస్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు

పెబ్బేరు రూరల్, జనవరి 24 : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం సూగూరు గ్రామంలోని కోదండరామస్వామి ఆలయంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో గురువారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నామని తిరుమల తిరుపతి శ్రీవారి సేవకులు సితార వెంకటేశ్వర్లు తెలిపారు. సామూహిక వ్రతాలు చేయదలుచుకున్న భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన పేర్కొన్నారు.



అడవి మృగాల దాడిలో రెండు దూడల మృతి

- చంపింది చిరుతనా?, హైనానా.?
- మూగజీవాలపై దాడితో రైతుల ఆందోళన

ఖిల్లాఘణపురం, జనవరి 24 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని షాపూర్, మానాజీపేట గ్రామాల శివారు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి వేర్వేరు ప్రాంతాల్లో అడవి మృగాల దాడిలో రెండు దూడలు మృతి చెందాయి. మండలంలోని షాపూర్ గ్రామ శివారు ప్రాంతంలో కర్నేతండా సాగు నీటి కాలువ వద్ద మామిళ్ల భీమయ్యకు చెందిన బర్రె దూడ అడవి మృగాల దాడిలో మృతి చెందిందని బాధితుడు వాపోయాడు. అదేవిధంగా, మానాజీపేట గ్రామ శివారులో సాగునీటి కాలువ దగ్గర హరిజన కర్రె చెన్న నరసింహకు చెందిన లేగ దూడపై అడవి మృగం దాడి చేసి చంపిందని బాధిత రైతు కన్నీరు మున్నీరయ్యాడు. మండలంలో రెండు నెలలుగా తరచు అడవి మృగాలు మూగజీవాలపై దాడి చేస్తున్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం నామమాత్రపు గాలింపు చర్యలు చేపడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై అటవీశాఖ డిప్యూటీ రేంజర్ భాస్కరాచారిని వివరణ కోరగా పశువులపై తరచుగా గుర్తు తెలియని అడవి మృగం దాడులు చేయడం వాస్తవమేనని, దాడులు జరిగిన ప్రాంతంలో చిరుత అడుగుజాడలు స్పష్టంగా కన్పించడం లేదని అన్నారు. మండలంలో సంచరిస్తున్నది చిరుతనా, హైనానా అనే అనుమానం ఉందని పేర్కొన్నారు. దాడిలో మరణించిన మూగజీవాలకు నష్టపరిహారం అందజేస్తామని ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వీపనగండ్ల, జనవరి 24 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై రవిప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం వసుపుల గ్రామానికి చెందిన సుప్పరి సురేష్(27) ఈనెల 22న అమ్మాయిపల్లి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో బొల్లారం చౌరస్తా నుంచి వీపనగండ్లకు చెందిన నరసింహ స్వగ్రామానికి వస్తున్నాడు. తూముకుంట సమీపంలో ప్రమాదవశాత్తు రెండు బైకులు ఢీకొన్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయప డిన సురేష్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. సురేష్ అవయవాలను దానం చేస్తున్నట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఎస్సై చెప్పారు.













‘రెవెన్యూ’ వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్‌ఏఐకు వినతి
- ‘రహదారికీ రైతుబంధు’పై విస్తృత చర్చ
- ‘ఆంధ్రజ్యోతి’ కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ‘రహదారికీ రైతుబంధు’ శీర్షికన బుధవారం ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని ‘ఆంధ్రజ్యోతి’ బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులను కోరినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మాణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్న దెబ్బ మాత్రమే తగిలిందని అన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతో మాత్రమే అధికారం కోల్పోయాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పును అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో కూడా వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్లపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధానమంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావో్‌స్‌లో పచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద క్యూ కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, మళ్లీ ఆ రోజులు వచ్చాయని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. మరోవైపు డబ్బులు పెట్టుకొని వెళ్లే పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.


బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్‌కుమార్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్లు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు. రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే అయినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని, మైనారిటీలు ఆలోచించాలని సూచించారు.


మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?


- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన అడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ ‘న్యాయ్ యాత్ర’ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాముల వారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత అడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్థక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను

సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరపున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్లు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్లు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.


రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

నారాయణపేట టౌన్, జనవరి 24: జిల్లాలోని జూనియర్, డిగ్రీ కళాశాలలో యాంటీడ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిహాల్‌లో మాదక ద్రవ్యాల నిషేధంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి సాగు జరుగకుండా వ్యవసాయ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని, ఇదీవరకే గంజాయి సాగు, సరఫరాపై మక్తల్, మద్దూర్ పీఎస్‌లో కేసులు నమోదయ్యాయని గుర్తు చేశారు. ఇలాంటి కేసులు నమోదు కాకుండా రెవెన్యూ, వ్యవసాయ, ఎక్సైజ్ అధికారులు దృష్టిని సారించి గంజాయి సాగును నిషేధించాలని ఆయన కోరారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు తీసుకున్న తర్వాత రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీ తెలంగాణగా మార్చాలని ఆదేశించారని, అందుకు రాష్ట్రస్థాయిలో యాంటీ నార్కోటిక్ విభాగాన్ని ఏర్పాటుచేసి ఒక డీఐజీ, జిల్లాస్థాయిలో పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా నియమించిందన్నారు. మాదక ద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు మాదక ద్రవ్యాల నిషేధంపై క్షేత్రస్థాయిలో నిఘా పెట్టాలని ఆయన ఆదేశించారు.సమావేశంలో జిల్లాలోని అధికారులు, ఆయాకళాశాలల యజమానులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మాగనూరు, జనవరి 24: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాగనూరు సర్పంచు రాజు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో వికాసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. పేదల కోసం కనీస మౌలిక సదుపాయాల కల్పన అణగారిన వర్గాల సామాజిక భద్రత ఆయుష్మాన్ భారత్, అటల్ పెన్షన్ సుకన్యయోజన సాధికారికపై మహిళలకు భరోసా రైతు సంక్షేమానికి భరోసా భారత్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంతకుముందు కేంద్ర సంక్షేమ పథకాలపై స్క్రీన్‌పై చూపించారు. కార్యక్రమంలో ఏపీజీబీ మేనేజర్ సుమన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సవిత పురోహిత్‌కు సన్మానం



సవిత పురోహిత్‌ను సన్మానిస్తున్న బాలు ఫ్యాన్స్ సంఘం సభ్యులు

నారాయణపేట, జనవరి 24: నారాయణపేట శక్తిపీఠం మార్గదర్శకులు యజ్ఞనారాయణ పురోహిత్ సతీమణి సవిత పురోహిత్ రామకోటి రాశారు. బుధవారం ఎస్పీ బాలు ఫ్యాన్స్ సంఘం ఆధ్వర్యంలో సవితకు పూలమాల వేసి శాలువాతో సత్కరించి క్యాలెండర్ అందించారు. కార్యక్రమంలో శక్తిపీఠం వ్యవస్థాపకుడు శాంతానంద్ మహారాజ్, టీడీపీ నాయకుడు ఓంప్రకాష్, బాలు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వసంత్, రామకృష్ణ పాల్గొన్నారు.

అవిశ్వాసం ఎలా పెడతారు?

- మునిసిపల్ తాజా, మాజీ చైర్‌పర్సన్ శిరీష

కోస్గి, జనవరి 24: బీఆర్ఎస్ నుంచి గెలిచి ముగ్గురు కౌన్సిలర్లు పార్టీ మారగా, మరో కౌన్సిలర్ మరణించగా అక్కడ ఎన్నిక జరగకుండా అవిశ్వాస తీర్మానాన్ని ఎలా పెడతారని మునిసిపల్ తాజా, మాజీ చైర్ పర్సన్ శిరీష అన్నారు. బుధవారం మునిసిపల్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహిస్తుండగా అక్కడకు వచ్చి నారాయణపేట ఆర్డీవో రాంచందర్‌తో వాగ్వాదం చేశారు. పార్టీని ధిక్కరించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. తాను కోర్టును ఆశ్రయించానని, మూడు వారాలు వాయిదా వేసిందని చెప్పారు. న్యాయ పోరాటం చేస్తానన్నారు. కాగా, కోర్టు ఆదేశించిన పత్రాలు ఎక్కడున్నాయో చూపాలని అధికారులు కోరడంతో చేసేదిలేక వెనుదిరిగింది.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

మద్దూర్, జనవరి 24 : కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని బీసీ వసతి సంక్షేమ వసతి గృహ జిల్లా అధికారి కృష్ణమాచారి అన్నారు. బుధవారం మద్దూర్‌లోని బీసీ సంక్షేమ వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భగా హాస్టల్ పరిసరాలను వంటగదిని, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విధిగా అందేలా చూడాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థునులకు రెండ జతల దుస్తువులు పంపిణీ చేశారు. ఆయన వెంట హాస్టల్ వార్డెన్ మంజుల , సిబ్బంది ఉన్నారు.

బీహార్ మాజీ సీఎంకు భారత రత్న ఇవ్వడం హర్షనీయం

నారాయణపేట, జనవరి 24: బీహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డు ఇవ్వడం పట్ల కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలం సీఎంగా, బీసీల అభ్యున్నతి కోసం పని చేసిన ఠాకూర్ తన కోసం కనీసం ఇల్లు, కారు సైతం లేకుండా జీవనం సాగించారన్నారు. ఆయన్ను నేటి పాలకులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అలాంటి కర్పూరీ ఠాకూర్‌కు తాజాగా కేంద్ర ప్రభుత్వం భారత రత్న ప్రకటించడం హర్షనీయమన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

మాగనూరు, జనవరి 24: మాగనూరు మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, బ్యాడ్ టచ్, గుడ్ టచ్, సెల్‌ఫోన్ వినియోగాల వల్ల కలిగే అనర్థాల గురించి బాలికలకు వివరించారు. కార్యక్రమంలో మాగనూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాజ్, స్వప్న, దీప, ఉపాధ్యాయునులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత

మాగనూరు, జనవరి 24: మాగనూరు మండలం నేరేడుగం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సర్పంచు అశోక్‌గౌడ్, ఎంపీటీసీ ఎల్లారెడ్డి క్రీడా సామగ్రిని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు ఆట పోటీలు నిర్వహించేందుకు క్రీడా సామగ్రిని ప్రధానోపాధ్యాయులు వెంకటయ్యకు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించి మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కారు బోల్తా .. వ్యక్తి మృతి

కృష్ణ, జనవరి 24: ప్రమాదవశాత్తు కారు రోడ్డు పక్కన ఉన్న అల్యూమినియం బారికేడ్‌ను ఢీకొని కారు బోల్తా పడటంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని చేగుంట గ్రామ శివారులోని 150వ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా కేంద్రానికి చెందిన రమేష్ (48)చేగుంట గ్రామ శివారులోని జాతీయ రహదారి పక్కన దాబా నడుపేవాడు. అర్ధరాత్రి దాబా మూసి తన కారులో తన ఇంటికి వెళ్తుండగా రోడ్డు పక్కన ఉన్న బారికేడ్‌ను ఢీకొని ఎగిరి కారు పక్కన ఉన్న పొలంలో బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న రమేష్ తలకు చాతికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనదారులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ విజయభాస్కర్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని కుటుంబసభ్యులు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగించినట్లు ఎస్ఐ అన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నారాయణపేటరూరల్, జనవరి 24: నారాయణపేట మండల పరిధిలోని అప్పిరెడ్డిపల్లి గ్రామంలో ఆంజనేయులుఅనే వ్యక్తికి చెందిన ఇంట్లో పీడీఎస్ బియ్యం నిల్వ ఉన్నాయనే పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా ఐదు క్వింటాళ్ల బియ్యం పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పేట రూరల్ ఎస్ఐ జయప్రసాద్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

200 కిలోల బెల్లం పట్టివేత

మరికల్, జనవరి 24: మరికల్ మండలం మాధరం గ్రామంలో కోమటి రవి హనుమాన్ కిరాణంలో అక్రమంగా నిల్వ చేసిన 200 కిలోల బెల్లం బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నిల్వ ఉంచిన బెల్లం చుట్టుప్రక్కల గ్రామాల తండాలకు అమ్ముతున్నట్లు పక్క సమాచారంతో దాడులు చేశామన్నారు. బెల్లం విలువ దాదాపు రూ. పదివేలు ఉంటుందన్నారు. కిరణం యజమాని కోమటి రవిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

- కలెక్టర్ శ్రీహర్ష



మొక్కను నాటి నీరుపోస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, జనవరి 24: మొక్కలను నాటి సంరక్షించాలని కలెక్టర్ శ్రీహర్ష కోరారు. బుధవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా నారాయణపేట సీడీపీవో కార్యాలయం ఆవరణలో బాలికలతో కలిసి కలెక్టర్ మొక్కలను నాటారు. అనంతరం సీడీపీవో, మహిళా సాధికారత కేంద్రాన్ని కలెక్టర్ పరి శీలించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ వేణుగోపాల్, సీడీపీవో, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించిన బాలికలను అభినందించిన కలెక్టర్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, సబ్ నేషనల్ చాంపియన్ షిప్ జూనియర్ నేషనల్‌స్థాయిలో ప్రతిభ చాటిన ధన్వాడ, మరికల్‌కు చెందిన బాలికలను కలెక్టర్ శ్రీహర్ష అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నేషనల్ కబడ్డీ పోటీల్లో అక్షయ, నెట్‌బాల్ పోటీల్లో కావ్య, రెజ్లింగ్ పోటీల్లో నాగలక్ష్మీ ప్రతిభను చాటారు. వీరిని కలెక్టర్ శాలువాలతో సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో అన్నిరంగాల్లో రాణించి తల్లిదండ్రులు, జిల్లాకు మంచిపేరు తేవాలని ఆయన క్రీడాకారులను కోరారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో వేణుగోపాల్, కోఆర్డీనేటర్ నర్సింహులు, డీవైఎస్‌వో వెంకటేష్, పీఈటీలు వెంకటప్ప, స్వప్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో..

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జాతీయ బాలికల దినోత్సవాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నారాయణపేట వారి ఆధ్వర్యంలో స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు అవగాహన సదస్సును నిర్వహించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్, డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతి గౌడ్, దత్తాత్రేయ, నాగేశ్వరి, రఘువీర్ పాల్గొని మాట్లాడారు. ప్రతీ సంవత్సరం జనవరి 24న భారతదేశం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహిస్తుందన్నారు. మన సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ అసమానతలను దూరం చేసేలా విద్యార్థుల్లో అవగాహన కల్గించేందుకు ప్రత్యేక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలికలకు ఉండే హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషక ఆహారం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో పారాలీగల్ వలంటీర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మక్తల్ పట్టణంలో..

మక్తల్: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం మక్తల్ పట్టణంలోని రాయచూరు రోడ్‌లో ఉన్న గురుకుల పాఠశాల నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు గురుకుల పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బేటీ బచావో.. బేటీ పడావో అనే నినాదంతో చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గురుకుల ప్రిన్సిపాల్ శ్వేతరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళలు చదువుకుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో కోఆర్డినేటర్ పరిమళ, ఉపాధ్యాయులు దీప్తి పాల్గొన్నారు.



మక్తల్‌లో మైనార్టీ గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలి

- నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

మరికల్, జనవరి 24: విద్యార్థులు లక్ష్యసాధన కోసం కష్టపడి చదువుకోవాలని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. బుధవారం మరికల్, పల్లెగడ్డ గ్రామాల్లో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలు, మాధవరం గ్రామంలో మహిళ సమాఖ్య భవనంతో పాటు తీలేరు గ్రామంలో మన ఊరు-మనబడి పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తీలేరు గ్రామంలో సర్పంచ్ రేవతమ్మ అధ్యక్షన సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ మాట్లాడుతూ పాఠశాలలో ఒకటవ తరగతి నుండి ఎనిమిదవ తరగతి వరకు 229 విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. క్రీడామైదానం, వంటశాల, డిజిటల్ తరగతులు, గ్రంథాలయానికి కావాల్సిన గది, మరో రెండు అదనపు గదులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి పోటీప్రపంచంలో ప్రైవేటు పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధనలు చేస్తూ ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలు నాణ్యమైన భోజనం అందజేస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలరు. నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు చదువుకోవాలన్నారు. పాఠశాల సమస్యలను దశలవారిగా పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ సురేఖరెడ్డి, సూర్యచంద్ర ఫౌండేషన్ చైర్మన్ సూర్యమోహన్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖా ధికారి అబుల్‌గని, ఎంపీడీవో శ్రీనివాసులు, సెక్టోరియల్ అధికారి విద్యాసాగర్, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సుజాత ఆంజనేయులు, శివరాములు, పట్టెల్‌శ్రీను, డీలర్ రవి, వెంకట్‌రెడ్డి, కుర్మన్నగౌడ్, కుర్మరి రాజు, గొల్లరాజు, కుర్వ గోవర్ధన్, హరీశ్, జంగిడి అంజి, రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

- అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

మక్తల్, జనవరి 24 : రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల నియమావళి పాటించాలని నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నియమావళి ప్రకారం రాజకీయ పార్టీలు నడుచుకోవాలన్నారు. అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల సిబ్బందికి సహకరించాలన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అవినీతిని బయట పెడతాం

- అధికార దుర్వినియోగంతో గద్దెనెక్కిన చైర్మన్ పదవిని దించాం
- పీసీసీ మెంబర్ విజయ్‌కుమార్



విలేకర్ల సమావేశంలో పాల్గొన్న నాయకులు

కోస్గిరూరల్, జనవరి 24: బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకొని చేసిన అవినీతి అక్రమాలను ఒక్కొక్కటిగా బయటపెడతామని పీసీసీ మెంబర్ విజయ్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగు సంవత్సరాల క్రితం అధికారం అడ్డుపెట్టుకొని తలుపుల మూసి నిబంధనలకు విరుద్ధంగా అప్పటికప్పుడు ఎక్స్‌అఫిషియో ఓట్లతో చైర్మన్ పదవిని దక్కించుకున్నారన్నారు. గౌరవ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టి చైర్మన్‌ను దించారన్నారు. ఇక నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చేసిన అవినీతి అక్రమాలను బయటపెడతామన్నారు. కొడంగల్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కావడం మనందరి అదృష్టమన్నారు. ప్రస్తుతం కొడంగల్ అభివృద్ధి చెందుతుందన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను కోస్గికి మంజూరయిందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అన్న కిష్టప్ప, నాగులపల్లి నరేందర్, కౌన్సిల ర్లు గోవర్ధన్, బాబునాయక్, ఇద్రిస్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ధాన్యం విక్రయాలు

నారాయణపేట, జనవరి 24: నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ధాన్యం విక్రయాల జోరు కొనసాగింది. వేరు శనగలు 1,429 క్వింటాళ్లు విక్రయానికి రాగా గరిష్ఠ ధర రూ.6,969, కనిష్ఠ ధర రూ.3,800, రమారమి ధర రూ.5,769, అలసందలు రెండు క్వింటాళ్లు విక్రయానికి రాగా గరిష్ఠ ధర రూ.7,266, కనిష్ఠ ధర రూ.7,266, రమారమి ధర రూ.7,266, సోనా 34 క్వింటాళ్లు విక్రయానికి రాగా గరిష్ఠ ధర రూ.3,059, కనిష్ఠ ధర రూ.2,989, రమారమి ధరలు రూ.3,059, హంస 18 క్వింటాళ్లు విక్రయానికి రాగా గరిష్ఠ, కనిష్ఠ, రమారమి ధరలు రూ.1960, ఎర్ర కందులు 380 క్వింటాళ్లు విక్రయానికి రాగా క్వింటాళ్ గరిష్ఠ ధర రూ.10,420, కనిష్ఠ ధర రూ.8,629, రమా రమిగా రూ.10,030, తెల్ల కందులు 49 క్వింటాళ్లు విక్రయానికి రాగా గరిష్ఠ ధర రూ. 10,559, కనిష్ఠ ధర రూ.9,870, రమా రమిగా రూ.9,870 పలికింది.

'రుణమాఫీ ఏకకాలంలో చేయాలి'

నారాయణపేట, జనవరి 24: రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో మాఫీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి యాదగిరిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు బంధు డబ్బుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తుందని ఆరోపించారు. రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో వేయడంతో పాటు రూ. రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేయాలని, కొత్త రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్పొరేట్ వ్యవసాయ చట్టం, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవడం, పంటలకు గిట్టుబాటు ధరలు, గ్యారెంటీ చట్టం చేయడం తదితర హామీలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తుందని ఆరోపించారు. వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కాశన్న, దస్తప్ప, కనకప్ప, అశోక్, వెంకటప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.

'అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలి'

నారాయణపేట వైద్యవిభాగం, జనవరి 24: ఈనెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలను ఉంచి జాతీయ జెండాలను ఆవిష్కరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు డీకే నరసింహ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. అంబేడ్కర్ చిత్రపటం ఏర్పాటు చేశాకే జాతీయ జెండా ఆవిష్కరించాలని ఆయన అధికారులు, ఆయా సంస్థల యజమానులను కోరారు.

'బీడీ కార్మికులకు పెన్షన్ అందజేయాలి'

మరికల్, జనవరి24: మరికల్ మండలం జిన్నారం గ్రామంలోని బీడీ కార్మికులకు పెన్షన్ అందజేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో బీడీ కార్మికులగా పనిచేస్తున్న వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. జీవో నెంబరు 50,59 ప్రకారం కార్మికులందరికీ పీఎఫ్, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీడీ కార్మికులు శాంతిబీ, రజియాబేగం, బాలామణి, శంకరమ్మ, అంజమ్మ , మహేశ్వరమ్మ, హేమలత పాల్గొన్నారు.

7, 8 వార్డుల్లో పారిశుధ్య పనులు



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సునీత

నారాయణపేట, జనవరి 24: నారాయణపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణం లోని 7, 8 వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగాయి. డ్రైనేజీలు, రోడ్లను సిబ్బంది శుభ్రం చేశారు. మునిసిపల్ కమిషనర్ సునీత పర్యవేక్షించారు.

వచ్చేనెల 16న గ్రామీణ బంద్

- సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి రాము



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రాము

నారాయణపేట టౌన్, జనవరి 24: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వచ్చేనెల 16న గ్రామీణ బంద్ సమ్మెకు పిలుపునిచ్చినట్లు సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి రాము, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామ్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి కొండన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళా భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యదర్శి యాదగిరి అధ్యక్షత వహించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వచ్చేనెల 16న గ్రామీణ బంద్ సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. సమ్మెను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ కమిటీలు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ట్రాక్టర్, వాహన ర్యాలీలు, వచ్చేనెల 16న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ కాశీనాథ్, కెంచె నారాయణ, అరుణోదయ రాములు, వ్యవసాయ కార్మిక సంఘం ప్రశాంత్, ఇప్పా నరసింహ, సీఐటీయూ బాల్‌రామ్, వ్యవసాయ కార్మిక సంఘం బాలప్ప, హాజీ, వెంకట్ రాములు, నారాయణ, దస్తప్ప, పీడీఎస్‌యూ సాయి, ఎస్ఎఫ్ఐ నరహరి, అరుణోదయ మల్లేష్, మహ్మద్ అలీ, పీవైఎల్ నసింహ పాల్గొన్నారు.

రిపబ్లిక్ డేను పురస్కరించుకొని పోలీసుల కవాతు





పోలీసులనుద్దేశించి మాట్లాడుతున్న అదనపు ఎస్పీ నాగేంద్రుడు, ఆర్ఐ శేఖర్ బాబు ఆధ్వర్యంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నారాయణపేట, జనవరి 24: ఈనెల 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో అదనపు ఎస్పీ నాగేంద్రుడు ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ శేఖర్‌బాబు పరేడ్ కమాండర్‌గా వ్యవహరించగా పోలీస్ బలగాలు కవాతు ఆకట్టుకున్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలం

మక్తల్, జనవరి 24 : మక్తల్ మండల పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం అధ్యక్షులు, రిటైర్డ్ పీఈటీ గోపాలం అన్నారు. బుధవారం సత్యసాయి మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మక్తల్ ఎస్టీవో పరిధిలో సుమారు 600మందికి పైగా పెన్షనర్లు ఉన్నారన్నారు. పెన్షనర్లకు అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేసి ఒకేసారి బకాయిలను నగదు రూపంలో చెల్లించాలన్నారు. పీఆర్సీలో 30శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలన్నారు. రూ.398తో పనిచేసిన ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్‌లు ఇవ్వాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు భవన నిర్మాణాలకు 500ల గజాల స్థలం కేటాయించాలన్నారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద 26న రిపబ్లిక్ డేలో పెన్షనర్లు పాల్గొనాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి భాస్కర్, కోశాధికారి సిద్దిలింగయ్య, ఉపాధ్యక్షులు కిష్టయ్యగౌడ్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.